సాక్షి
కుమురం భీం
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



కాలికోం వాయిస్తున్న మెస్రం వంశీయుడు



మహాపూజకు బయలుదేరిన మెస్రం వంశీయులు

నమో నాగోబా

- మెస్రం వంశీయుల మహా పూజతో జాతర షురూ
- సంప్రదాయబద్ధంగా ఆదివాసీల పూజలు
- హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

నాగోబా.. ఆదివాసీల ఆరాధ్య దైవం. పుష్యమాస అమావాస్య పురస్కరించుకుని కేస్లాపూర్‌లోని ఆలయం శుక్రవారం భక్తజనంతో పులకించింది. రోజంతా మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఉదయం ప్రత్యేక వాయిద్యాల నడుమ.. తెల్లని వస్త్రాలతో తరలివచ్చారు. ఆనవాయితీగా వచ్చే ఎర్రటి కుండల్లో నీటిని తీసుకువచ్చి ఆడపడుచులు కొత్త పుట్టను తయారు చేశారు. రాత్రి ఆలయాన్ని శుద్ధి చేసి పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించారు. మహాపూజ అనంతరం జాతర షురూ అయింది.

– ఇంద్రవెల్లి



విద్యుత్ వెలుగుల్లో నాగోబా ఆలయం



గంగా జలంతో ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



డోలు కొడుతున్న చిన్నారులు

కేస్లాపూర్‌లో గత నెల 21న గంగాజల సేకరణ కోసం మొదలైన మెస్రం వంశీయుల పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఉదయం గ్రామంలోని మురాడి నుంచి నాగోబా విగ్రహం, పూజ సామగ్రిని ఆలయానికి చేర్చారు. మర్రిచెట్టు వద్ద బస చేసిన వంశీయులు పవిత్ర గంగాజలంను సంప్రదాయ వాయిద్యాలైన డోలు, తుడుం, కాలికోమ్, పెప్రే వాయిస్తూ శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. మైసమ్మ దేవతకు పూజలు చేసి లోనికి ప్రవేశించారు. నాగోబాను దర్శించుకుని పూజలు చేశారు. 22 కితలకు చెందిన మహిళలు, ఆడపడుచులు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుని వారి నుంచి కొత్త కుండలు అందుకున్నారు. వంశ అల్లుళ్లతో కలిసి వారు మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి పవిత్ర జలం సేకరించి ఆలయానికి తీసుకొచ్చారు. ప్రధాన్ కిత సంప్రదాయ వాయిద్యాల మధ్య ఆలయం పక్కనే గల పాత పుట్టలను అల్లుళ్లు తవ్వారు. ఆ మట్టితో ఆడ పడుచులు తిరిగి కొత్త పుట్టలు తయారు చేశారు. వాటిని తీసుకొని సతీ దేవత ఆలయం ముందు ఏడు వరుసలతో బౌల దేవతను తయారు చేసి మొక్కుకున్నారు. ఈ పూజలు సాయంత్రం వరకు కొనసాగాయి.



నాగోబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం తదితరులు

గంగాజలంతో అభిషేకం..

పవిత్ర గంగాజలంతో రాత్రి 9 నుంచి 11 గంటల వరకు ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం నాగోబాను అభిషేకించి మహాపూజ చేపట్టారు. (ఈ సమయంలో మెస్రం వంశీయులు ఇతరులను అనుమతించరు.) అనంతరం వచ్చిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మెస్రం వంశీయులతో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టి జాతరను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి మెస్రం వంశీయులు, భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసర ప్రాంతం జనసంద్రంగా మారింది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శనివారం తెల్లవారుజాము 3 గంటల వరకు బేటింగ్ (పరిచయ పూజ) నిర్వహించారు. ఇప్పటి వరకు నాగోబా సన్నిధికి రాని సుమారు వందకు పైగా మెస్రం వంశ కొత్త కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి ఇందులో పాల్గొన్నారు. వంశ మహిళల సహకారంతో ముందుగా వారితో సతీదేవత, నాగోబా ఆలయాల్లో పూజలు చేయించి దేవతలను చూపెట్టారు. అనంతరం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ తంతుతో వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్టుగా భావిస్తారు. కార్యక్రమంలో మెస్రం వంశం పటేల్ వెంకట్‌రావ్, కటోడ కోసు, వంశ పెద్దలు కోసేరావ్, బాదిరావ్, లింబారావ్, దాదారావ్, కోత్వల్ తిరుపతి, వంశ ఉద్యోగులు మనోహర్, దేవ్‌రావ్, సోనేరావ్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏడు వరుసల బౌల దేవతను తయారు చేసి మొక్కుతున్న మహిళలు



కోనేరు వద్ద పవిత్ర జలాన్ని కుండలలో నింపుతూ..

ఫొటోలు.. : సాక్షి, ఫొటోగ్రాఫర్



పుట్ట తయారీ కోసం ఆవు పేడను తీసుకొస్తున్న మెస్రం ఆడపడుచులు



వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న ఆడపడుచులు



మహాపూజకు హాజరైన మెస్రం వంశీయులు

న్యూస్‌రీల్

ఆటో డ్రైవర్లకు రూ.10వేలు అందించాలి



ఆటోలో వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.10వేల ఆర్థికసాయం అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆటోలో వెళ్లి నిరసన తెలిపారు.

పీవీకి భారతరత్న గర్వకారణం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

భైంసాటౌన్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్రం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం గర్వకారణమని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం అసెంబ్లీలోని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు వీటీజీ సెట్

బెల్లంపల్లి: ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆదిలాబాద్ రీజియన్‌లోని మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో 25 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. రీజియన్ వ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, మహాత్మాజ్యోతిబాపూలే, గిరిజన సంక్షేమ, ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు 44 ఉన్నాయి. 3,520 సీట్లు ఉండగా.. 8,844 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.

సీసీరోడ్ల నిర్మాణం ప్రారంభించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో కేటాయించిన సీసీరోడ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధిహామీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో 273 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వందశాతం పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కోసర పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. వాటర్ షెడ్ పథకం, పీఎంకేఎస్‌వై కింద చేపడుతున్న ఊట కుంట పనులను పరిశీలించారు. డీఆర్‌డీవో సురేందర్, డీటీ పోచ్చయ్య తదితరులు ఉన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీడీఎం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సహకార బ్యాంక్ ఆవరణలో రైతులకు డిజిటల్ లావాదేవీలపై నాబార్డ్ డీడీఎం వీరభద్రరావు శుక్రవారం అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రాయితీ పథకాల గురించి వివరించారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలన్నారు. నాబార్డ్ ఎఫ్ఎల్‌సీ అంజన్న, సహకార బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఫీల్డ్ అధికారి రాజేంద్రకుమార్, డైరెక్టర్లు దేవన్న, శంకర్, మురళీకృష్ణ, మధుకర్, ఆశన్న పాల్గొన్నారు.

‘ఎంపీ టికెట్ నాకే..’



అమిత్ షాతో మాట్లాడుతున్న ఎంపీ ‘సోయం’

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ తనకే వస్తుందని, దీనిపై కేంద్ర మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లావాసులు చిరకాల కోరిక అయిన ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని విన్నవించారు. మూడోసారి మోదీ సర్కార్ నినాదంతో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నాలుగు ఎమ్మెల్యే స్థానాలు గెలవడంపై అమిత్ షా అభినందించారని అన్నారు. ‘ఎంపీ’ ఎన్నికల ప్రచారానికి సైతం వస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మాస్టర్ ట్రినర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, ఇతర సిబ్బందికి ఎన్నికల నియామవళి, విధుల నిర్వహణ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలన్నారు. సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరిగాయని, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. అందరికీ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత శిక్షకులపై ఉందన్నారు. మొదట సెక్టోరల్ అధికారులకు శిక్షణ పూర్తయిందని, ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రినర్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రిసైడింగ్ డైరీలో ప్రతీ సమాచారాన్ని నమోదు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్ కేసులు వేగంగా పరిష్కరించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసుల దర్యాప్తులో మరింత నాణ్యత పాటిస్తూ వేగంగా పరిష్కరించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహనాల తనిఖీలు, రాత్రి పూట పెట్రోలింగ్ చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసు నమోదు చేయాలన్నారు. సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీని ప్రతిరోజూ మానిటరింగ్ చేయాలని ఎస్సైలను ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- అడ్డాగా మారుతున్న ఆసిఫాబాద్ పట్టణం
- అంకుసాపూర్ శివారులో గంజాయి గ్యాంగ్ ఆగడాలు
- కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా విక్రయాలు
- యుక్త వయస్సులో బానిసలుగా మారుతున్న వైనం



ఆసిఫాబాద్ పట్టణంలో కళాశాలను ఆనుకుని గుడారాలు

సాక్షి, ఆసిఫాబాద్: గంజాయి మత్తు యువత జీవితాలను నాశనం చేస్తోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా గంజాయి మత్తులో తూగుతున్నారు. సరదాగా ప్రారంభించి బానిసలుగా మారి జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ కళాశాల విద్యార్థులకు స్థానికంగా ఉండే కొందరు ఆకతాయిలు గంజాయి మత్తును అలవాటు చేయడంపై ఆ కళాశాల ప్రిన్సిపల్ జిల్లా ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇది జిల్లా కేంద్రంలో గంజాయి మహమ్మారి విస్తరిస్తోన్న వైనానికి అద్దం పడుతోంది.

కళాశాల విద్యార్థులే టార్గెట్

జిల్లాలోకి కొన్ని ప్రాంతాల్లో గంజాయి సాగు ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరకే వస్తుండటంతో త్వరగా ఈ మత్తుకు అలవాటు పడుతున్నారు. రోజుకు మూడు, నాలుగుసార్లు తీసుకుంటూ గొడవలు, అల్లర్లు సృష్టిస్తున్న ఘటనలు ఉన్నాయి. ఆసిఫాబాద్ పట్టణంలోని కొన్ని విద్యాసంస్థల్లో గంజాయి ముఠా సభ్యులు మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం. కళాశాల విద్యార్థులే లక్ష్యంగా ఈ ముఠాలు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా గత రెండేళ్లలో గంజాయి తీసుకుంటున్న వారి సంఖ్య 15 శాతం పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 2023లో 9 గంజాయి కేసులు నమోదు కాగా.. రూ.3.43 లక్షల విలువైన 17.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

‘గ్యాంగ్’ ఆగడాలు..

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే అంకుసాపూర్ గ్రామ శివారు ప్రాంతం గంజాయి గ్యాంగ్‌కు అడ్డాగా మారింది. స్థానిక గిరిజన కళాశాల ప్రహరీని ఆనుకుని 60 అడుగుల రహదారిలో ఉన్న కొన్ని దుకాణాలు.. గుడారాలు మత్తు పదార్థాలకు నిలయంగా మారినట్లు సమాచారం. సాయంత్రం ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే భయంగా ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న యువతతో ఎలాంటి ఆపద ముంచుకొస్తుందేమోనన్న ఆందోళన అక్కడివారిలో ఉన్నట్లు తెలుస్తోంది. కళాశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న గుడారాల్లో మత్తు మందు సేవించిన కొందరు నిత్యం పెద్దపెద్ద శబ్దాలు చేస్తుండటంతో విద్యార్థుల చదువులకు ఇబ్బందిగా మారుతోందని కొందరు కళాశాల సిబ్బంది పేర్కొంటున్నారు. 60 అడుగుల రహదారిలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న గుడారాలను తొలగించాలని, వారి ఆగడాలతో తన వ్యాపారం దెబ్బతింటోందని అక్కడ డీటీసీపీ అనుమతితో లేఅవుట్ వేసిన వెంచరు యజమాని రామచందర్ కూడా ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటు రెవెన్యూ, అటు పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పుడు ఆ ప్రాంతం గంజాయి గ్యాంగ్‌కు అడ్డాగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అడ్డాగా మారిన అంకుసాపూర్ శివారు

ఆందోళనలో తల్లిదండ్రులు..

సాధారణంగానే యుక్త వయస్సు పిల్లల్లో ఆలోచనలు స్థిరంగా ఉండవు. వాళ్లకు ప్రతిదీ ఒక ప్రయోగమే. అది మంచి చేస్తుందా? జీవితానికి చెడు తలపెడుతుందా? అన్న ఆలోచన చేయలేరు. మనిషి ప్రవర్తనను ఉగ్రంగా మార్చే గంజాయి మత్తు అన్ని వయసుల వారిని తన గుప్పింట్లోకి లాక్కుంటోంది. ఈ మాయదారి మత్తు చేతికి పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం చిక్కుతూ ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. బంగారు భవిష్యత్తు కోసం శ్రమించాల్సిన యువకులు తెలియని ఆనందం అంటూ గంజాయిని గుప్పుమనిపిస్తున్నారని, ఆ ఘాటు పొగ మధ్యలో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వారు వాపోతున్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గంజాయి విక్రేతలను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని.. అదేవిధంగా గంజాయి సాగును నియంత్రించాలని పోలీసులను తల్లిదండ్రులు, సామాజికవేత్తలు కోరుతున్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

గంజాయి సాగుదారులు, విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి గ్యాంగ్‌ల ఆగడాలపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలు విక్రయించే ముఠాలపై నిఘా ఉంచుతాం.

– వెంకటరమణ, డీఎస్పీ, ఆసిఫాబాద్

క్లుప్తంగా

సమస్యలపై పట్టింపేది?

మంచిర్యాలఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా విద్యారంగ సమస్యలు పట్టించుకోవటం లేదని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ ఆరోపించారు. శుక్రవారం మంచిర్యాలలో ఏఐఎస్‌బీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి సన్నీగౌడ్‌తో పాటు పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

మందమర్రిరూరల్: మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో పోలీస్, మందమర్రి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి శశిధర్ (ఏఆర్ డీఎస్పీ) మెమోరియల్ ఫుట్‌బాల్ పోటీలను జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి శుక్రవారం శశిధర్ సతీమణి మమతతో కలిసి ప్రారంభించారు. ముందుగా శశిధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కోల్‌బెల్ట్ ప్రాంతంలో క్రీడాకారులకు కొదవ లేదని, స్నేహభావంతో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు. టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్, మందమర్రి ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు రాంవేణు, రమేశ్, రాజనర్సు, శ్రీకాంత్, కర్ణాకర్, సురేందర్, కాంగ్రెస్ నాయకురాలు సరిత పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ సీనియర్ మహిళలు, పురుషుల జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 12న ఉదయం 9.30 గంటలకు వేంపల్లిలోని ఎస్సార్కేఎం నర్సింగ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, హెచ్ఎఫ్ఐ ఎలిజిబిలిటీ ఫామ్ రెండు సెట్లు తీసుకుని రావాలని పేర్కొన్నారు. వివరాలకు 98663 95859 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై కేసు

చెన్నూర్: చెన్నూర్ పట్టణం, మండలానికి చెందిన ఐదుగురు బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చెప్పుల దండ వేసి ఉన్న ఫొటోలను గ్రూపుల్లో షేర్ చేసినట్లు చెప్పారు. ఫొటోలను షేర్ చేసిన చెన్నూర్ మండలం కిష్టంపేటకు చెందిన గాలిపల్లి రవికుమార్, చెన్నూర్‌కు చెందిన కముట మనోహర్, షంషీర్‌ఖాన్, రేవెల్లి రాజు, బోగె భారతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో కులమతాలను రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేసినవారితోపాటు గ్రూప్ అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని బతుకమ్మ వాగు నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. అనంతరం ట్రాక్టర్లను మైనింగ్ ఏడీ బాలుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

నాగోబా సందడి

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర శుక్రవారం రాత్రి నిర్వహించిన మహాపూజతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు చేశారు. ప్రధాన్ కిత తెగకు చెందిన చిన్నారులు ఆదివాసీ సంప్రదాయ మంగళవాయిద్యాలు, డోలు వాయించి ఆకట్టుకున్నారు.

– ఇంద్రవెల్లి/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


మురాడి నుంచి పూజాసామగ్రి, నాగోబా ప్రతిమను ఆలయానికి తీసుకువస్తున్న మెస్రం వంశీయులు


కుండ అందుకుంటున్న మహిళలు


కొత్త పుట్టకు పూజలు చేస్తున్న వంశ మహిళలు


మైసమ్మ దేవతకు మొక్కుతున్న వంశీయులు


గంగాజలాన్ని ఆలయ ప్రదేశంలో కడుతూ..


తలపాగా చుడుతూ..


సంప్రదాయ వాయిద్యాలతో చిన్నారులు


అగ్నిగుండం చుట్టూ కూర్చున్న భక్తులు


సంప్రదాయ పూజలు చేస్తున్న భక్తులు

అట్టహాసంగా లింగుస్వామి జాతర

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం వెంకటాపూర్ పంచాయతీ పరిధి మారుమూల ప్రాంతం కుర్రెఘడ్‌లో శుక్రవారం ఆదివాసీలు భక్తితో కొలిచే పాహుండి కూపర్ లింగుస్వామి జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. మూడ్రోజులపాటు నిర్వహించే జాతరలో భాగంగా మొదటిరోజు జెండావిష్కరణ చేశారు. మూడురకాల కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఆదివాసీలు సంప్రదాయ పూజలు చేశారు. రాత్రిళ్లు భజన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం అగ్నిగుండం, మాలవిరమణ, దర్బార్, పెద్దపూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వివిధ పూజాకార్యక్రమాల అనంతరం జాతర ముగుస్తుందని వివరించారు. – కాసిపేట

ఇందారం, ఆర్కే ఓసీల సందర్శన

భీమారం: జైపూర్ మండలం ఇందారం ఓపెన్ కాస్ట్ గనిని శుక్రవారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. గనిలో చేపట్టిన బొగ్గు ఉత్పత్తి గురించి కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. అనంతరం పని ప్రదేశాలను పరిశీలించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలని సూచించారు. ఉత్పత్తి అయిన బొగ్గు వినియోగదారులకు సరైన సమయంలో రవాణా చేయాలని తెలిపారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ప్రతీ ఉద్యోగి, అధికారి పాటుపడాలని సూచించారు. జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్, గని ఆపరేషన్ మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజినీర్ రమేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్‌ప్లానింగ్) వెంకటేశ్వరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఓసీ మ్యాప్‌ను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. యంత్రాల పనితీరు మరింత మెరుగుపర్చుకుని సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఏరియా జీఎం మనోహర్, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఏజీఎం నాగరాజు, ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఇందారం గనిని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వరిలో మొగి పురుగు.. నివారణ ఇలా..

చెన్నూర్‌రూరల్: యాసంగిలో సాగు చేసిన వరిని మొగి (పీక) పురుగు ఎక్కువగా ఆశిస్తోందని, తగిన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు సూచించారు. పురుగు ఉధృతిని గమనించి దీపపు ఎరలు, సోలార్ దీపపు ఎర లేదా లింగార్షక బుట్టలు అమర్చుకోవాలని తెలిపారు. ఎరలతో పురుగులు బుట్టల్లో పడి పోతాయని పేర్కొన్నారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు పెట్టి అందులో వారానికి 25నుంచి 30 పురుగులు పడినప్పుడు సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. నారుమడి దశలోనే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా ఫిప్రోనిల్ గుళికలు చల్లాలని తెలిపారు. 15రోజుల పిలక దశలోనైతే ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10కిలోలు చల్లాలని, లేదా కార్టాప్‌హైడ్రాక్లోరైడ్, ఫిప్రోనిల్ గుళికలను యూరియాలో లేదా ఇసుకలో కలిపి చల్లాలని పేర్కొన్నారు. చిరు పొట్ట దశలో పురుగు ఉన్నట్లయితే కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.



కన్నీరుపెట్టిన వెంకటాపూర్

- అశ్రునయనాల మధ్య కోట దంపతులు, కుమారుడి అంత్యక్రియలు

భీమిని: 'అయ్యో దేవుడా.. ఎంత పని చేస్తివి.. నా వాళ్లు లేకుండా నేను బతికేది ఎట్ల'.. అని అమ్మానాన్నతో పాటు అన్నను కోల్పోయిన అనూష రోధించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. గురువారం బెల్లంపల్లి శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కోట తిరుపతి–తిరుమల దంపతులతోపాటు వారి కుమారుడు అంజన్న మృతి చెందారు. శుక్రవారం వెంకటాపూర్‌లో ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడం, వారి కుమార్తె అనూష ఒంటరై రోధించిన తీరుకు వెంకటాపూర్ గ్రామస్తులు కంటతడి పెట్టారు. కోట బాపు తన కొడుకు తిరుపతి, మనుమడు అంజన్నకు, కోడలు తిరుమలకు ఆమె తండ్రి మధునయ్య తలకొరివి పెట్టారు.


అంత్యక్రియలకు హాజరైన గ్రామస్తులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు నాయిని శ్రీజ, పడిగెల వైష్ణవి, మంచర్ల అంజలి, గంట వైష్ణవి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 7వ తేదీన సీసీసీ కార్నర్ ఓల్డ్ బ్లూబర్డ్ పాఠశాలలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో వీరు అత్యుత్తమ ప్రతిభకనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ నెల 16నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెం ప్రాంగణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను స్కూల్ కమిటీ చైర్మన్ తాడూరి భాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీఈటీ

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

బెల్లంపల్లి: జీవితంపై విరక్తి చెంది ఒకరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కే సురేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన జాడి రవి (42) మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడ్డాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పురుగుల మందు తాగి మరొకరు..

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లికి చెందిన హరీశ్ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసుగాం ఎస్సై రామన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన హరీశ్ తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. గురువారం రాత్రి ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి విషయం కుటుంబ సభ్యులకు తెలిపాడు. చికిత్స కోసం అతడిని కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూవివాదంలో ఐదుగురిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం బోడపల్లిలోని గడిల సత్తయ్యకు చెందిన భూమి కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య భూమికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ భూమిలోకి అక్రమంగా చొరబడడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసిన మల్లేశ్, శంకర్, గణేశ్, దేవయ్య, లచ్చన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'పులి' కేసు నిందితులకు బెయిల్ తిరస్కరణ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో తాజాగా పెద్దపులిని హతమార్చిన కేసులో నిందితులకు కోర్టు బెయిల్ తిరస్కరించినట్లు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు. పులిని హతమార్చిన కేసులో నిందితులకు కోర్టు బెయిల్ తిరస్కరించినట్లు వివరించారు. పులి సంరక్షణకు సిబ్బంది కృషి చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలు తెలిపారు. కార్మికులకు సొంతింటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం, అలవెన్స్‌లపై ఇన్‌కంటాక్స్ మాఫీ తదితర అంశాలను యజమాన్యం దృష్టికి తీసుకువెళ్తున్నామని పేర్కొన్నారు. కొత్త భూగర్భగనుల ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చిస్తూ వాటికి కావాల్సిన అనుమతుల కోసం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. కార్మిక ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, రిటైర్డ్ ఉద్యోగులకు సీపీఆర్ఎం స్కీం కింద రూ.8లక్షలు, డిపెండెంట్ ఉద్యోగుల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం .. తదితర సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని చెప్పారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, నాయకులు జైపాల్‌రెడ్డి, వెంగళ కుమారస్వామి, చిలువేరి సదానందం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు కల్పించాలి

శ్రీరాంపూర్: కోలిండియా తరహాలో సింగరేణిలోనూ ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని ఏరియా అధికారులు కోరారు. శుక్రవారం పలువురు అధికారులు సీఎంవోఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోలిండియాలో కల్పిస్తున్నట్లు ఇంటర్నల్ అండర్ మేనేజర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లకు ప్రమోషన్ పాలసీని ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. దీనిపై పలుసార్లు యాజమాన్యానికి విన్నవించినా ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ నాయకులైనా స్పందించాలని కోరారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. అధికారులు గంట మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, బాలకృష్ణ, రమేశ్, కాంతారావు, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

బెల్లంపల్లి: మున్సిపల్ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర పురపాలక కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్య రామునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గవర్నర్ తమిళిసైని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ వార్డు అభివృద్ధికి ఏడాదికి రూ.50 లక్షలు చొప్పున కేటాయించాలని కోరారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

పాతమంచిర్యాల: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీకి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 85 కోట్లమంది బీసీల ఆకాంక్ష నెరవేర్చేలా కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు రాసమల్ల కుమార్, కొంతం రాజు, కీర్తి భిక్షపతి, ఆరెందుల రాజేశం, అంకం సతీశ్, అందె సంతోష్, వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

రామకృష్ణాపూర్: సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని మందమర్రి జీఎం మనోహర్ సూచించారు. ఏరియాలోని ఆర్కే ఓసీలో శుక్రవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో జీఎం మాట్లాడారు. సంస్థ ముందు అనేక సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికలు ఉంటాయని తెలిపారు. వీటిని అధిగమించాలంటే ఉద్యోగులందరి కృషి అవసరమని పేర్కొన్నారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు నిబద్ధతతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలన్నింటినీ సాధిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, సీఎంవోఏఐ ఏరియా అధ్యక్షుడు సత్యారి రమేశ్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఏజీఎం నాగరాజు, ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం మనోహర్

రక్షణతో కూడిన ఉత్పత్తి తప్పనిసరి

శ్రీరాంపూర్: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం ఆర్కే 6 గనిపై మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యాలను సాధించేందుకూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని సూచించారు. బొగ్గు నాణ్యత కూడా పెరిగితేనే సంస్థ మరిన్ని లాభాలు గడిస్తుందని చెప్పారు. ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉందని, తగ్గించుకోవడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బొగ్గు ఉత్పత్తికి వినియోగించే యంత్రాలను మరింత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, గ్రూపు ఏజెంట్ ఏ వెంకటేశ్వరరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, గని మేనేజర్ ఈ తిరుపతి, అధికారులు మల్లయ్య, మురళీధర్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కాంతారావు, గని రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి సునీల్‌కుమార్, నాయకులు కొమురయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

'మహిళలూ డంపర్లు నడపాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో మహిళా ఉద్యోగులు కూడా డంపర్లు, షవల్స్ నడిపే స్థాయికి రావాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. సింగరేణిలో ఇటీవలి కాలంలో మహిళా ఉద్యోగులు అధికసంఖ్యలో చేరినట్లు తెలిపారు. వారు తమకు నైపుణ్యం ఉన్న కేటగిరీలను ఎంచుకుని ముందుకెళ్లాలని సూచించారు. షవల్, డంపర్ ఆపరేటర్లుగా కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో కూడా ప్రతిభ కనబరిచి ఆయా కేటగిరీల్లో పదోన్నతులు పొందడానికి కృషి చేయాలని సూచించారు. దీనికి కంపెనీ తగిన ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. అనంతరం ఓవర్ బర్డెన్ కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులతో ఓబీ వెలికితీతపై సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన ఓబీ లక్ష్యాన్ని చేరుకోవాలని, అప్పుడే బొగ్గు వెలికితీత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతీ ఉద్యోగి నిర్దేశించిన కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి బీ పురుషోత్తంరెడ్డి, గని మేనేజర్ సుధీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

నీటి యాజమాన్యం, సంరక్షణపై శిక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నీటి యాజమాన్యం, సంరక్షణపై శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో జిల్లాలోని ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు. జాతీయ నీటి మిషన్, నీరు, హైదరాబాద్ భూమి యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థ (వాలంతరీ) సంయుక్తంగా వాన నీటిని ఒడిసి పట్టడంలో భాగంగా రెండురోజుల శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా వ్యవసాయాధికారి జీ కల్పన హాజరై మాట్లాడారు. వాతావరణ మార్పు పరిస్థితుల్లో నేల, నీటి యాజమాన్యం అత్యవసరమని తెలిపారు. నీటి పరిరక్షణ ద్వారా లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో కురిసే వానలను ఒడిసి పట్టుకునేందుకు పాంపాండ్స్ లాంటి నిర్మాణాలు చేపట్టడం, ఎక్కడికక్కడ కురిసిన వాన నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం, బిందు, తుంపర సేద్యం, యాజమాన్యం తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. శిక్షణలో వాలంతరీ సహాయ వ్యవసాయాధికారి కే సునీత, ఎస్ఆర్ఎఫ్ జీ గిరీశ్, నెటాఫిమ్ ఏజీఎం ఏఎస్ సుబ్బారావు, హాజీపూర్ ఏవో మార్గం రజిత పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: కన్నెపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం ఈస్‌గాం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న 39 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అమీర్‌ఖాన్, మహేశ్, యజమాని రాజిక్‌పై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

రేషన్‌డీలర్‌పై కేసు

కౌటాల: తుమ్మిడిహెట్టి రేషన్‌డీలర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 6–ఏ కేసు నమోదు చేశారు. శుక్రవారం గ్రామంలోని రేషన్‌షాపును అధికారులు తనిఖీ చేశారు. రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నట్లు డీటీ శ్రీనివాస్ తెలిపారు. లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్ పైడి శ్రీనివాస్‌పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యామ్‌లాల్ ఉన్నారు.